క్లుప్తంగా

అసాంఘిక కలాపాలపై నిఘా ఉంచాలి


రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

బనగానపల్లెరూరల్: అసాంఘిక కలాపాలపై పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచాలని జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి సూచించారు. మండలంలోని నందివర్గం పోలీసు స్టేషన్‌ను మంగళవారం జిల్లా ఎస్పీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పెండింగ్ కేసులపై ఆరా తీశారు. వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను పరిశీలించారు. అలాగే శిథిలావస్థలో ఉన్న పాత పోలీసు స్టేషన్, పోలీసు క్వార్టర్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ రఘువీర్‌రెడ్డి మాట్లాడుతూ ఫాక్షన్ కేసుల్లో ఉన్న ముద్దాల కదలికలపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ శ్రీనివాసరెడ్డి, హెడ్ కానిస్టేబుల్ నూర్‌బాషా పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చండీ హోమం


హోమం నిర్వహిస్తున్న దృశ్యం

కోవెలకుంట్ల: స్థానిక జమ్మలమడుగు చౌరస్తాలోని వెంకట రమణ కాలనీలో వెలసిన అష్టలక్ష్మి కల్యాణ వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఈ మేరకు మంగళవారం ప్రాతఃకాల పూజలు, దీక్షా హోమాలు, ప్రధాన హోమాదులు, జపాదులు, వేదపఠనములు, యంత్రాభిషేకం, మహాస్నపనము, మహామంగళహారతి కార్యక్రమాలు జరిగాయి. అనంతరం లోకకల్యాణార్థం చండీహోమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన హంపీ విరూపాక్షవిద్యారణ్య భారతీస్వామి భక్తులకు ఆధ్మాత్మిక సందేశమిచ్చారు.

పట్టుబడిన వాహనాల వేలం

డోన్ రూరల్ : స్థానిక సెబ్ కార్యాలయంలో మంగళవారం నంద్యాల జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరిండెంటెడ్ శ్రీధర్‌రావు, సెబ్ సీఐ భీమలింగడు ఆధ్వర్యంలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు వేలం పాట నిర్వహించారు. మూడు ద్విచక్ర వాహనాలు, ఒక ఆటోను వేలం వేయగా రూ. 56,700 వచ్చిందని శ్రీధర్‌రావు తెలిపారు. అలాగే అక్రమంగా పట్టుపడిన సారాను మండల పరిధిలోని అబ్బిరెడ్డిపల్లి చెరువు వద్ద ధ్వంసం చేశారు. 1425లీటర్ల నాటు సారాతోపాటు 65.52 లీటర్ల మద్యం బాటిళ్లను ధ్వంసం చేశామని చెప్పారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అక్రమంగా నాటుసారా, మద్యం అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పశువుల పాక దగ్ధం

ప్యాపిలి: మండల పరిధిలోని నల్లబల్లి వద్ద మంగళవారం పశువుల పాక దగ్ధం కావడంతో రెండు ఎద్దులు తీవ్రంగా గాయపడ్డాయి. రైతు బావిపల్లి వెంకటేశ్ తన పొలంలో పశువుల పాక నిర్మించుకున్నాడు. పశువులతో పాటు వ్యవసాయానికి సంబంధించిన సామాగ్రిని అందులో ఉంచాడు. మంగళవారం తెల్లవారుజామున పశువుల పాకకు నిప్పంటుకోవడంతో రెండు ఎద్దులు గాయపడ్డాయి. అలాగే పైపులు, ఎరువులు, ఇతర సామాగ్రి పూర్తిగా దగ్ధమై దాదాపు రూ. 3 లక్షల వరకు నష్టం వాటిల్లింది. గుర్తు తెలియని వ్యక్తులు పశువుల పాకకు నిప్పంటించారని బాధితుడు వాపోయాడు.

వాహనాల తనిఖీ

డోన్ రూరల్: పట్టణంలోని రూరల్ పోలీస్ స్టేషన్ సమీపాన మంగళవారం ఎంవీఐ క్రాంతి కుమార్ వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీలో ఇండియన్ ఆర్మీకి సంబంధించిన సమాగ్రిని తరలిస్తున్న వాహనానికి ఎస్కార్ట్ గా వెళ్తున్న వాహనాన్ని తనిఖీ చేశారు. టాక్స్ కట్టకుండా వెళ్తుండడంతో సీజ్ చేసి రూ. 14,290 జరిమానా విధించామని క్రాంతికుమార్ తెలిపారు.

పశువుల చోరీ

డోన్ రూరల్: మండల పరిధిలోని కొత్తకోట గ్రామంలో సోమవారం రాత్రి ఏడు పశువులు చోరీకి గురయ్యాయి. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు... మోడె సోమశేఖర్‌కు చెందిన రెండు ఎద్దులు, మూడు ఆవులు, చెంచు సుధాకర్‌కు చెందిన ఒక ఎద్దు, నాగరాజుకు చెందిన ఒక ఎద్దును దొంగలు తీసుకెళ్లారన్నారు. ఈ మేరకు రూరల్ పోలీస్ స్టేషన్‌లో పోలీసులకు ఫిర్యాదు చేయడం జరిగిందని గ్రామ ప్రజలు తెలిపారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

డోన్ టౌన్: లారీ డ్రైవర్లకు, కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ఆదుకోవాలని లారీ మోటార్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శివరాం కోరారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం కార్మికులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రయాణ సమయంలో ప్రమాదాలకు గురై ప్రాణాలు పోగొట్టుకున్న అనేకక కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని, సంక్షేమ బోర్డు ఏర్పాటు రక్షణ కల్పించాలని కోరారు. సమావేశంలో సీఐటీయు నాయకులు నాగమద్దయ్య, ఆదినారాయణరెడ్డి, శివరంగస్వామి, ధనుంజయగౌడ్, మహానంది, జబ్బార్‌మియా తదితరులు పాల్గొన్నారు.

సమృద్ధిగా భూగర్భ జలాలు!

- నిండుకుండాలా దద్దణాల చెరువు
- వేసవిలోనూ తగ్గని నీటి మట్టం
- పెరిగిన సాగు విస్తీర్ణం
- సంతోషం వ్యక్తం చేస్తున్న రైతులు


నిండుకుండాల జలకళను సంతరించుకున్న దద్దణాల ప్రాజెక్టు


పెద్దరాజుపాలెంలో సాగు చేసిన మొక్కజొన్న

బనగానపల్లె: వేసవిలోనూ భూగర్భ జలాలు సమృద్ధిగా ఉంటున్నాయి. దీంతో వ్యవసాయ బోర్ల కింద పంటల సాగు సంతృప్తి కరంగా ఉంటుంది. రెండు కార్లు సాగు సాగిస్తున్నారు రైతులు. ప్రత్యేకించి బనగానపల్లె పట్టణ సమీపానున్న దద్దణాల చెరువు నిండు కుండలా దర్శనమిస్తుంది. వేసవిలోనూ ఏ మాత్రం నీటి మట్టం తగ్గలేదు. నంద్యాల జిల్లాలోనే అతిపెద్ద మీడియం ప్రాజెక్టు దద్దణాల చెరువు. దాదాపు 1513 ఎకరాల ఆయకట్టు కలిగిన 25 అడుగుల నీటి సామర్థ్యం కలిగిన ఈ ప్రాజెక్టు నీటితో కళకళలాడుతోంది. గత ప్రభుత్వ నిర్లక్ష్యం మూలంగా కాల్వల పూడిపోవడంతో దద్దణాల చెరువు నుంచి సాగునీరు సరఫరా కానప్పటికీ నీటితో నిండుకుండలా ఉండడంతో సమీప గ్రామాల్లో భూగర్భ జలాలు సమృద్ధిగా ఉన్నాయి. దీంతో సాగు, తాగు నీటి సమస్య తలెత్తడం లేదు. గతంలో భూగర్భ జలాలు అడుగంటి ఈ ప్రాజెక్టు పరిధిలోని 12 గ్రామాల ప్రజలు తాగు, సాగు నీటి సమస్యతో సతమతమయ్యారు. ప్రత్యేకించి తాగునీటి కష్టాలు వర్ణనాతీతం. మోటార్ సైకిల్, సైకిళ్లపై కిలో మీటర్ల దూరం వెళ్లి బిందెలతో తాగునీరు తెచ్చుకునే వారు ఈ ప్రాంతం ప్రజలు. ప్రస్తుతం ఆ సమస్యే లేదని ఆయా గ్రామాల ప్రజలు, రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పెరిగిన పంటల సాగు విస్తీర్ణం

దద్దణాల ప్రాజెక్టు పరిధిలో 12 గ్రామాలు ఉన్నాయి. ఈ చెరువులో నీరు సమృద్ధిగా ఉండడంతో వ్యవసాయ బోర్లలో నీరు పుష్కలంగా ఉన్న నేపథ్యంలో పంటల సాగు విస్తీర్ణం పెరిగింది. పసుపల, చిన్నరాజుపాళెం, పెద్దరాజుపాళెం, క్రిష్ణగిరి, చెర్లోకొత్తూరు, తాండా గ్రామాల్లో మొక్కజొన్న కంది తదితర పంటలు సాగు చేశారు రైతులు. ప్రత్యేకించి పసుపల పంచాయతీతోపాటు మజరాలైన ఏడు తండా గ్రామాల్లో సాగునీటి సమస్య తీరింది. గతంలో పంటలు పండక రైతులు సైతం కర్ణాటక, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు జీవనోపాధి నిమిత్తం వలసలు వెళ్లే పరిస్థితి. మూడేళ్లుగా వర్షాలు సమృద్ధిగా పడడంతోపాటు దద్దణాల ప్రాజెక్టు నిండుగా ఉండడంతో వ్యవసాబోర్ల కింద పంటలు విస్తారంగా సాగవుతున్నాయి. తండా గ్రామాల్లో రబీలో మొక్కజొన్న కంది తదితరు పంటలను రైతులు ఎక్కువగా సాగు చేశారు. మొక్కజొన్న పంట ఆశాజనకంగా ఉన్నందున ఎకరానికి 25-30 క్వింటాళ్ల దిగుబడి లభిస్తుందంటున్నారు రైతులు. క్వింటాం రూ.2వేల గిట్టుబాటు ధర లభిస్తున్నందున పెట్టుబడిపోను మిగులు ఉంటుందని రైతులు ఆశిస్తున్నారు.

చెరువు అభివృద్ధికి రూ.14 కోట్లతో ప్రతిపాదనలు

గత ప్రభుత్వాల నిర్లక్ష్యం మూలంగా ఆయకట్టు కాల్వలు పూడిపోయాయి. దాదాపు నీటి సరఫరా నిలిచిపోయింది. పేరొందిన ఈ ప్రాజెక్టును పట్టించుకునే నాథుడు కరువయ్యారు. అయితే ప్రస్తుతం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి చెరువు అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టారు. ఈ మేరకు సంబంధిత అధికారులు షట్టర్‌తోపాటు, ప్రధాన పంట కాల్వలు, విద్యుత్ సరఫరా, జనరేటర్ తదితర అభివృద్ధి పనులకు రూ.14 కోట్లతో ప్రతిపాదనలు పంపినట్లు సమాచారం.

టీడీపీ పాలనలో చుక్కనీరు లేదు



ఐదు సంవత్సరాల టీడీపీ పాలనలో ప్రాజెక్టులో చుక్కనీరులేదు. నెలకొన్న వర్షాభావ పరిస్థితుల మూలంగా ఈ సమస్య ఏర్పడింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మూడు సంవత్సరాలు వరుసగా మంచి వర్షాలు కురిసి ప్రాజెక్టు నీటితో కళకళలాడుతుంది. చెరువును అభివృద్ధి చేస్తే సాగు విస్తీర్ణం ఇంకా పెరుగుతుంది. – గడ్డం వెంకటేశ్వరరెడ్డి, ప్రాజెక్టు సాగునీటి సంఘం అధ్యక్షులు

మూడేళ్లుగా సాగునీటి సమస్య లేదు



దద్దణాల చెరువులో నీరు సమృద్ధిగా ఉండడంతో బోర్లలో నీరు బాగుంది. దీంతో మూడేళ్లుగా సాగునీటి సమస్య లేదు. వ్యవసాయబోర్లలో నీరు సమృద్ధిగా ఉండడం సాగు నీటి కష్టాలు తీరాయి. రెండుకార్లు పంటలు సాగు చేస్తున్నాం. పంటల దిగుబడులు బాగా వస్తున్నాయి. చెరువును పూర్తిగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. – వెంకటేశ్వర్లు, ఆయకట్టు రైతు, సాదుకొట్టం

చెరువు అభివృద్ధికి ప్రతిపాదనలు



దద్దణాల చెరువులో నీరు సమృద్ధిగా ఉంది. ఈ నీరు పరిసర ప్రాంత గ్రామాల్లో భూగర్భజలాలు అభివృద్ధి చెంది వ్యవసాయబోర్ల ద్వారా రైతులు మంచి పంటలు పండించుకుంటున్నారు. ప్రాజెక్టు అనకట్టతో పాటు ప్రధాన పంట కాల్వలు అభివృద్ధి చేసేందుకురూ.14 కోట్లతో ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరుకాగనే అభివృద్ధి పనులు చేపడుతాం. – ఎ.రఘురామ్, ఏఈఈఈ మైనర్ ఇరిగేషన్, బనగానపల్లె

గాలికుంటు వ్యాధి అత్యంత ప్రమాదకరం

బనగానపల్లె: పశువులకు సోకే గాలికుంటు వ్యాధి అత్యంత ప్రమాదకరమని పశుసంవర్ధక శాఖ ఏడీ మారుతిసకారామ్ తెలిపారు. ఈ వ్యాధి సోకకుండా బుధవారం నుంచి పశువులకు టీకాలు వేసే కార్యక్రమం చేపట్టామన్నారు. బనగానపల్లె మండలానికి 28,550, అవుకు మండలానికి 17050 డోసుల టీకాలు సరఫరా చేసినట్లు తెలిపారు.

రేపటి నుంచి టీకాలు

కొలిమిగుండ్ల: జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా బుధవారం నుంచి మార్చి 31 వరకు పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా టీకాలు వేసే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పశువైద్యాధికారి పద్మావతి తెలిపారు. నాలుగు నెలలు దాటిన ప్రతి పశువుకు టీకాలు వేయించాలని పాడి రైతులకు సూచించారు.

నేడు భూమి పూజ

కొలిమిగుండ్ల: మండల కేంద్రం కొలిమిగుండ్లలో నూతనంగా నిర్మించనున్న వాల్మీకి మహర్షి ఆలయానికి బుధవారం భూమి పూజ నిర్వహించనున్నట్లు వాల్మీకి సంఘం మండల అధ్యక్షుడు ఉలవల నరసింహుడు తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డితో పాటు పలువురు ప్రముఖులు హాజరవుతున్నట్లు చెప్పారు. వాల్మీకులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్యాపిలి: మండల పరిధిలోని పీఆర్ పల్లి, నల్లమేకలపల్లి సబ్‌స్టేషన్‌ల పరిధిలోని అన్ని గ్రామాల్లో బుధవారం విద్యుత్ పరఫరాలో అంతరాయం ఉంటుందని ప్యాపిలి ఏఈ వినయ్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. చంద్రపల్లిలో జగనన్న కాలనీలో 33 కేవీ లైన్ షిఫ్టింగ్ పనులు చేపడుతున్నందున ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారుల సహకరించాలని ఆయన కోరారు.

దర్జీల సంక్షేమానికి పెద్దపీట


కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, టైలర్లు


పాతబస్టాండ్‌లోని పూజలు చేస్తున్న టైలర్లు

కోవెలకుంట్ల: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం దర్జీల సంక్షేమానికి పెద్దపీట వేసిందని మండల కో ఆప్షన్ మెంబర్, టైలర్ల సంఘం అధ్యక్షుడు దిల్కాబాషా అన్నారు. మంగళవారం కోవెలకుంట్ల పట్టణంలో టైలర్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయ సమీపంలో టైలర్లు కేక్‌కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. ఆయన మాట్లాడుతూ దర్జీ వృత్తి నమ్ముకుని జీవనం సాగిస్తున్న కుటుంబాల స్థితి గతులను పాదయాత్ర సమయంలో గుర్తించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే వారి సంక్షేమం కోసం ఒక్కో టైలర్‌కు ఏడాదికి రూ. 10 వేలు అందజేసి అండగా నిలిచారని పేర్కొన్నారు. అలాగే మరో కార్యక్రమంలో టైలర్ల సంఘం అధ్యక్షుడు అహమ్మద్ ఉసేన్ ఆధ్వర్యంలో టైలర్స్‌డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో టైలర్ల సంఘం నాయకులు మధుసూదన్‌రెడ్డి, రాజు, ఉసేని, ఈశ్వరయ్య, మోహన్, మధు, చిన్నన్న, హరికృష్ణ, రాముడు, బాషా, గుంజలపాడు బాషా, బ్రహ్మం, ఓబులేసు, అమడాల రామయ్య, కొత్తపల్లె బాష పాల్గొన్నారు.

బేతంచెర్ల : మండల కేంద్రం బేతంచెర్లలో టైలర్స్ డే వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. మిషన్‌ను కనిపెట్టిన విలియమ్స్ హో చిత్ర పటానికి టైలర్స్ సంఘం గౌరవ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు ఎల్లయ్య, ఖలీల్, పుల్లయ్య ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం టైలర్స్ సంఘం అధ్యక్షుడు ఎల్లయ్యను టైలర్స్ సన్మానించారు. కార్యక్రమంలో టైలర్స్ సభ్యులు గంగన్న, మద్దిలేటి, హరి, చంద్రారెడ్డి, సంజీవ్, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

డోన్ టౌన్: దర్జీల (టైలర్లు) సంక్షేమానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెద్దపీట వేసిందని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణ సమీపంలోని రాయల్ సర్కిల్ వద్ద డోన్ టైలర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో టైలర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి ఆధునిక టెక్నాలజీ కారణంగా యువత రెడిమేడ్ దుస్తుల వైపు మల్లడంతో టైలర్ల జీవన శైలిలో పెనుమార్పులు వచ్చాయన్నారు.ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి టైలర్లకు ఆర్థిక సాయం చేస్తున్నారన్నారు. అనంతరం సీనియర్ టైలర్లు ఏ.చంద్రశేఖర్‌రావు, బి చంద్రలను సత్కరించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ రామచంద్రుడు, టైలర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆలా మల్లికార్జున, ఉపాధ్యక్షులు రాఘవేంద్ర, కార్యదర్శి ఇస్మాయిల్, సహాయ కార్యదర్శి రహిమాన్, కోశాధికారి లల్లీరావ్, సభ్యులు రాజేంద్ర, ప్రభాకర్, భాస్కర్, మనోహర్, నరసింహులు, నాగేంద్ర, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు. – అదేవిధంగా కుట్టు మిషన్ సృష్టి కర్త విలియమ్స్ హో జయంతిని పురస్కరించుకొని డోన్ టైలర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పాతపేట రాములదేవాలయంలో సమావేశమై ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి


సమావేశంలో మాట్లాడుతున్న పాపిరెడ్డి

కొలిమిగుండ్ల: వేసవి ప్రారంభం కావడంతో పల్లెల్లో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని, చేతి పంపులకు మరమ్మతులు చేపట్టి సిద్ధంగా ఉంచాలని జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అధికారులకు సూచించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కారపాకుల నాగవేణి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా తుమ్మలపెంట ఎంపీటీసీ సభ్యురాలు యాతం నాగమ్మ, అంకిరెడ్డిపల్లె ఉప సర్పంచ్ కొప్పుల లక్ష్మి కాంతరెడ్డి మృతి పట్ల సభ్యులు రెండు నిమిషాల పాటు మౌనం వహించి నివాళులర్పించారు. అనంతరం మీర్జాపురంలో రెండు పాఠశాలల్లో ఇటీవల ఇద్దరు ఉపాధ్యాయులు పదోన్నతిపై వెళ్లారని, ఖాళీలను భర్తీ చేయాలని సర్పంచ్ లాయర్ మహేశ్వరరెడ్డి సభ దృష్టికి తీసుకొచ్చారు. ఉమ్మాయిపల్లెలో అంగన్‌వాడీ కేంద్రానికి భవనం మంజూరైందని, త్వరగా స్థలాన్ని ఎంపిక చేయాలని సర్పంచ్ మొలక రాజారెడ్డి అధికారులను కోరారు. గ్రామాల్లో ఫీల్డ్ రస్తాలు ఏర్పాటు చేయాలని పలువురు ప్రజా ప్రతినిధులు కోరారు. శనగల కొనుగోలు కేంద్రాలను ఆయా గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టాలని కోరారు. అనంతరం జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యతనిస్తున్నామని, కాలనీల్లో రోడ్లు, విద్యుత్, మంచినీటి సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుబ్బరాజు, ఆర్‌అండ్‌బీ డీఈ సుదీర్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సస్యరక్షణతో అధిక దిగుబడులు


సమావేశంలో మాట్లాడుతున్న సుమిత్ర

బేతంచెర్ల: మామిడి సాగులో రైతులు సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చని ఉద్యాన పరిశోధన స్థానం మహానంది శాస్త్ర వేత్త డాక్టర్ సుబ్రహ్మణ్యం, వైఎస్సార్ ఉద్యాన విశ్వ విద్యాలయం పాలక మండలి సభ్యురాలు సుమిత్ర అన్నారు. మంగళవారం మండల పరిధిలోని యంబాయిలో సర్పంచ్ యుగంధర్‌రెడ్డి, ఉద్యాన శాఖ అధికారి రఘువరున్, పట్టు పరిశ్రమ సహాయకురాలు రాజేశ్వరి ఆధ్వర్యంలో మామిడి తోటలో ప్రస్తుతం ఉన్న తెగుళ్లు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ మామిడిలో పిందె పసుపు రంగులోకిమారి రాలకుండా అరికట్టడానికి ఎన్ఎస్ఏ ఫ్లానోఫిక్స్ 1 మిల్లీ లీటర్ ను 4.50 లీటర్ల నీటిలో కలిపి 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేయాలని, లేదా 2-4డీ 1 గ్రామును 100 లీటర్ల నీటిలో కలిపి 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేయాలన్నారు. పండు ఈగ నివారణకు మిథైల్ యూజినల్ అనే రసాయనాన్ని ఉపయోగించి తయారు చేసిన లింగాకర్షక బుట్టలు ఎకరాకు 6-10 వరకు చెట్టకు అమర్చాలని సూచించారు.

ఎమ్మెల్సీగా వెన్నపూసను గెలిపించండి


టీఆర్ నగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న మున్సిపల్ చైర్మన్

డోన్ : పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా వైఎస్సార్‌సీపీ బలపరిచిన వెన్నపూస రవీంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ కోరారు. పట్టణంలోని తారకరామ నగర్, కృష్ణమూర్తి నగర్ ప్రాంతాల్లో మంగళవారం వైఎస్సార్‌సీపీ నాయకులు పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించాలని ప్రచారం చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మల్లికార్జునరెడ్డి, వెంకట్రాముడు, సుంకన్న, నాయకులు ఎద్దుపెంట వెంకటేష్, మల్లికార్జున, బ్రహ్మం, బోయ దస్తగిరి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

బేతంచెర్ల: పశ్చిమ రాయలసీమ పట్ట భద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించాలని కోరుతూ మంగళవారం వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఆయన సోదరుడు వెన్నపూస నరేష్ రెడ్డి మండల పరిధిలోని గోరుమానుకొండ, సీతారామాపురం, శంకలాపురం, యంబాయి, ఎం.పేండేకల్లు, ముద్దవరం, కొలుములపల్లె, బలపాలపల్లె, తవిసి కొండ గ్రామాల్లో ప్రచారం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు డక్కి శేఖర్, మురళీ కృష్ణ,రామనాయుడు, తిరుమలేశ్వర్‌రెడ్డి, గోరుమానుకొండ సర్పంచ్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కోవెలకుంట్ల: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలుపుకోసం కోవెలకుంట్ల, సంజామల మండలాల్లో ఆ పార్టీ నాయకులు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. మంగళవారం కోవెలకుంట్ల మండలంలోని భీమునిపాడు, కంపమల్ల, గుళ్లదూర్తి, పొట్టిపాడు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. అలాగే సంజామల మండలంలోని కమలపురి, వసంతాపురం, బొందలదిన్నె, ముదిగేడు, ఎగ్గోని, ముచ్చలపురి, ముక్కమల్ల, ఆకుమల్ల, రెడ్డిపల్లె, నట్లకొత్తూరు గ్రామాల్లో ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి గుండం సూర్యప్రకాష్‌రెడ్డి, ఎస్టీసెల్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసనాయక్ మాట్లాడుతూ మార్చి 13న జరిగే ఎన్నికల పోలింగ్‌లో రవీంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని పట్టభద్రులను కోరారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల నాయకులు కుపేంద్రారెడ్డి, సుధాకర్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, వైఎస్ కాశీం, హరినాథరెడ్డి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

బనగానపల్లెరూరల్: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించాలని కోరుతూ మంగళవారం నాయకులు ప్రచారం చేశారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపకులను కలిసి మొదటి ప్రాధాన్యత ఓటు రవీంద్రారెడ్డికి వేయాలని వైఎస్సార్‌సీపీ నాయకులు జీవీ నారాయణ, అల్తాఫ్, చిచ్చుబుడ్డి సాదక్ తదితరులు కోరారు.

జొన్న దిగుబడులు బుగ్గిపాలు

బనగానపల్లెరూరల్: మండలంలోని సలామాబాద్ గ్రామంలో మంగళవారం వెంకటాపురం గ్రామానికి చెందిన రైతు ద్వారం కరుణాకర్‌రెడ్డికి సంబంధించిన జొన్న దిగుబడులు బుగ్గిపాలు అయ్యాయి. బాధిత రైతు తెలిపిన వివరాల మేరకు సలామాబాద్‌లోని తన సొంత పొలంతోపాటు మరికొంత భూమిని కౌలుకు తీసుకొని 16 ఎకరాల్లో జొన్న పంట సాగు చేశారు. ఇటీవలే జొన్న పంట కోసి కంకులను ఒకచోట కుప్పగా పోసి ఉంచారు. సోమవారం రాత్రి సమీపంలో ఉన్న బీడు పొలాల్లోని చెత్తకు ఎవరో నిప్పుపెట్టడంతో మంటలు వ్యాపించి కంకుల కుప్పు అంటుకుంది. దీంతో జొన్న కంకులు పూర్తిగా కాలి బుడిదగా మారింది. సుమారు 60-70బస్తాల జొన్నలు అవుతాయని, దాదాపు రూ. 8 లక్షల వరకు నష్టం వాటిల్లిందని బాధిత రైతు వాపోయాడు. నందివర్గం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వీఆర్ఏ నాగేశ్వరరావుతో పాటు పోలీసులు జొన్న దిగుబడులు దగ్ధమైన ప్రదేశాన్ని పరిశీలించారు.

గాడిచెర్ల సేవలు చిరస్మరణీయం

కోవెలకుంట్ల: గ్రంథాలయ పితామహుడిగా పేరుగాంచిన గాడిచెర్ల హరిసర్వోత్తమరావు సేవలు చిరస్మరణీయమని వక్తలు కొనియాడారు. గాడిచెర్ల 63 వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం స్థానిక గ్రంథాలయ ఆవరణలో రిటైర్డ్ లైబ్రేరియన్ పల్లె నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాయలసీమ విద్యార్థి సంఘం వ్యవస్థాపకుడు ఓబులేసు, బీజేపీ నాయకుడు లింగన్న, రిటైర్డ్ హెచ్ఎం నారాయణ స్వామి, గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు.

విజయ డెయిరీ పాల బోనస్ పంపిణీ

బనగానపల్లెరూరల్: బనగానపల్లె, బేతంచర్ల మండలం శంకరాపురం గ్రామంలోని విజయ డెయిరీ యూనిట్ పరిధిలోని గ్రామాలకు చెందిన పాడి రైతులకు మంగళవారం డెయిరీ మేనేజర్ మధుసూధన్‌బాబు రూ.2,52, 424 బోనస్ పంపిణీ చేశారు. బనగానపల్లె విజయ డెయిరీ యూనిట్ పరిధిలోని బీరవోలు మహిళా సోసైటీలోని 22 మంది రైతులకు రూ.42, 500, శ్రీ లక్ష్మీ సెంటర్‌లోని 13 మంది రైతులకు రూ.17,218, శ్రీనివాసరెడ్డి సెంటర్‌లోని 29 మంది రైతులకు రూ. 39, 972లు అందజేశారు. అదే విధంగా శంకరాపురం యూనిట్ పరిధిలోని కొలుముల పల్లె గ్రామం మఠం శరబయ్య సెంటర్‌కు రూ.42,970, ఇదే గ్రామంలోని బోల్లవరం సరోజమ్మ సెంటర్‌కు రూ. 32,232, సాధినేని మధవస్వామి సెంటర్‌లోని రైతులకు రూ. 14,112లు, బలపాల్‌పల్లె గ్రామంలోని దూదేకుల సిద్ధమ్మ సంటర్‌లోని రైతులకు రూ.16,217లు. పి కొట్టాల కామిరెడ్డి వసుధేవరెడ్డి సెంటర్‌లోని రైతులకు రూ.22,196 అందజేశారు. లీటర్‌కు రెండు రూపాయల ప్రకారం బోనస్‌గా విజయ సంస్థ మంజూరు చేసినట్లు మేనేజర్ తెలిపారు.

బందోబస్తు మధ్య భూ సర్వే


అధికారులతో వాగ్వాదం చేస్తున్న రైతులు

బనగానపల్లెరూరల్ : మండలంలోని యనకండ్ల సమీపంలో ఉన్న శ్రీ జయజ్యోతి సిమెంట్ పరిశ్రమకు రైల్వేలైన్ ఏర్పాటు కోసం చేపట్టిన భూ సేకరణ సర్వే పనులు మంగళవారం పోలీసుల బందోబస్తుతో మధ్య సాగింది. ఫ్యాక్టరీ సమీప పొలాల్లో ఆర్డీఓ వెంకటరెడ్డి, తహసీల్దార్ శ్రీనివాసులు, డీఎస్పీ శ్రీనివాసరెడ్డి సమక్షంలో అధికారులు సర్వే చేపట్టారు. దీంతో భూములు కోల్పోతున్న రైతులు తాము కంపెనీకి భూములను ఇచ్చేదిలేదన్నారు. పొలాల మధ్యలోనే రైల్వేలైన్ వెళ్లడం మూలంగా నష్టం జరుగుతుందని రైతులు ఆర్డీఓ వెంకటరెడ్డితో వాగ్వాదానికి దిగారు. తమ అనుమతిలేనిదే పొలాలను సర్వే చేయరాదని హైకోర్టు స్టే ఉన్నట్లు ఆర్డీఓ వెంకటరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. హైకోర్టు ఇచ్చిన తీర్పులో ఎక్కడ సర్వే అపరాదని లేదని, రూల్స్ పాలో కావాలని ఉన్నట్లు ఆర్డీఓ రైతులకు తెలిపారు. ఆర్డీఓ వెంకటరెడ్డి మాట్లాడుతూ భూసేకరణ రైతుల అంగీకారంతోనే తీసుకోవడం జరుగుతుందని, ప్రస్తుతం ఏ రైతు పొలం, ఎంత విస్తీర్ణంలో పోతుంది అనే విషయాల సేకరణకు మాత్రమే భూ సర్వే చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బనగానపల్లె సీఐ సుబ్బరాయుడు, ఎస్ఐ రామిరెడ్డి, అవుకు ఎస్ఐ జగదీశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీయాలి

కోవెలకుంట్ల: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయాలని ఎంఈఓ తిమ్మారెడ్డి, వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బాబునాథ్ అన్నారు. పట్టణంలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలలు, పాఠశాలల్లో మంగళవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయా విద్యాలయాల్లో సీవీ రామన్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయా పాఠశాలల విద్యార్థిని, విద్యార్థులు సైన్స్ డేను పురస్కరించుకుని వివిధ పరికరాలను తయారు చేసి ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాల్లో వారు మాట్లాడుతూ సీవీ రామన్ దేశ ప్రజల కోసం సైన్స్‌లో అనేక ప్రయోగాలు చేశారని సేవలను కొనియాడారు. అనంతరం సైన్స్ డే ప్రదర్శనలో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు హనంత రామసుబ్బారెడ్డి, భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, రాజు, శశాంక, అన్నపూర్ణ, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు శివశంకర్‌రెడ్డి, రామకృష్ణయ్య, నీరజ, సుగుణ, నాగేశుడు, ప్రసాద్, వెంకటేశ్వరరెడ్డి, షబ్బీర్ ఉసేన్, సురేష్‌రెడ్డి, ఉసేనయ్య, గఫూర్ పాల్గొన్నారు.

బనగానపల్లెరూరల్: మండలంలోని పలు ప్రభుత్వ, జెడ్పీ ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని మంగళవారం హెచ్ఎంల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ స్వర్ణలతాదేవి ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా సర్ సీవీ రామన్ చిత్ర పటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు.

డోన్ టౌన్: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త సర్ సీవీ రామన్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

ప్యాపిలి: విజ్ఞాన రంగానికి సర్ సీవీ రామన్ చేసిన సేవలు చిరస్మరణీయం అని రాచర్ల ఉన్నత పాఠశాల హెచ్ఎం, సైన్సు ఉపాధ్యాయుడు సురేశ్‌బాబు అన్నారు. జాతీయ వైజ్ఞానిక దినోత్సవం సందర్భంగా మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో మంగళవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. సర్ సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాచర్ల, బూరుగల, ప్యాపిలి బాలుర ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులు సైన్సుకు సంబంధించిన ప్రదర్శనలు ఏర్పాటు చేశారు.